## 27న సింగరేణి 'గుర్తింపు' ఎన్నికలు

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 4: సింగరేణి సంస్థలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను ఈ నెల 27న నిర్వహించేందుకు డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ దేవరకొండ శ్రీనివాసులు సర్క్యులర్ విడుదల చేశారు. హైదరాబాద్‌లోని ఆర్ఎల్‌సీ కార్యాలయంలో డీవైసీఎల్‌సీ డీ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం 14 కార్మిక సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ ఏడాది అక్టోబర్‌లో సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు ప్రక్రియను మొదలు పెట్టినప్పటికీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఈ ఎన్నికలను వాయిదా వేశారు. పాత షెడ్యూల్ ప్రకారమే ఈ నెల 27న ఎన్నికలు నిర్వహించేందుకు కార్మిక సంఘాలు అంగీకరించాయి. ఈ మేరకు సోమవారం డీవైసీఎల్‌సీ సర్క్యులర్‌ను విడుదల చేశారు. గతంలో అక్టోబర్‌లో నామినేషన్ల స్వీకరణ, నామినేషన్లు గడువు పూర్తి, నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, అదే నెల 10న స్క్రూట్నీ కూడా జరిగిందని తెలిపారు. తాజా సర్క్యులర్ ప్రకారం ఈ నెల 6న ఓటర్ల జాబితా పరిశీలన, 7న ఆర్వో ఎదుట అభ్యంతరాల స్వీకరణ, 8న ఓటర్ల జాబితా విడుదల వంటి ప్రక్రియలు చేపట్టనున్నట్లు వివరించారు. సింగరేణి సంస్థ వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లోని 39,991 మంది కార్మికులు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 27న ఉదయం నుంచి ఎన్నికల ప్రక్రియ జరుగనుంది.

# బాధ్యతాయుత ప్రతిపక్ష పాత్ర పోషిస్తాం

- కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో పార్టీని మరింత పటిష్టం చేస్తాం
- ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్

ఖమ్మం, డిసెంబర్ 4: తెలంగాణలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ల నాయకత్వంలో పార్టీని మరింత పటిష్టం చేసుకుంటామని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ పేర్కొన్నారు. బాధ్యతయుతమైన ప్రతిపక్ష పాత్రను పోషిస్తూ అధికార పక్షానికి సహకరిస్తామని అన్నారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీని మరింత బలోపేతం చేస్తామని, ప్రజల్లోకి పార్టీని తీసుకెళ్తామని అన్నారు. ప్రజల తీర్పును సమీక్షించుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ తరపున, బీఆర్ఎస్ తరపున ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గెలుపొందిన ఎమ్మెల్యేలకు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామని అన్నారు. 2.03 శాతం ఓట్ల తేడాతో తెలంగాణలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం విచారకరమని అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రజలకు అందేలా చూడాలని అన్నారు. జిల్లా ప్రజల సమస్యలపై జవాబుదారీతనంగా ఉండేలా పనిచేస్తామన్నారు. ఇకముందు కూడా మరింతగా ప్రజాక్షేత్రంలోకి వెళ్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ కృషిచేసిన పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలుపుతున్నామన్నారు. రాష్ట్ర ప్రజలతో పాటు జిల్లా ప్రజలు కూడా మార్పును కోరుకొని కాంగ్రెస్‌ను గెలిపించారన్నారు. భద్రాచలంలో బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావును గెలిపించిన ఆ నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతుకుంటున్నామన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం 2001లో పార్టీని స్థాపించిన కేసీఆర్.. అనేక ఉద్యమాలు చేసి రాష్ట్రాన్ని సాధించారని, ఈ క్రమంలో ఎన్నో గెలుపోటములను చూశారని గుర్తుచేశారు. ఆ తరువాత రాష్ట్రాన్ని సాధించి రెండు సార్లు అధికారంలోకి వచ్చిన విషయం చరిత్రలో చిరస్థాయిగా మిగులుతుందని అన్నారు. 75 ఏళ్లలో ఏ రాష్ట్రంలోనూ జరగని అభివృద్ధి కేవలం తొమ్మిదేళ్లలో తెలంగాణలో జరిగిందని స్పష్టం చేశారు. ఉద్యమనేత కేసీఆర్ సీఎంగా ఉండి.. సుపరిపాలన అందించారని, అధికారాన్ని వికేంద్రీకరణ చేశారని వివరించారు. రాష్ట్రం బాగుండాలని కోరుకునే పార్టీ తమదని, అదే గురుతరమైన బాధ్యతతో ప్రతిపక్ష పాత్రను పోషిస్తామని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆర్‌జేసీ కష్ణ, ఉప్పల వెంకటరమణ, కూరాకుల నాగభూషణం, పగడాల నాగరాజు, చింతనిప్పు కృష్ణచైతన్య, డోకుపర్తి సుబ్బారావు, జక్కుల లక్ష్మయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తాతా మధు

## నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు: తుమ్మల



ఖమ్మం, డిసెంబర్ 4: ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం ఎమ్మెల్యేగా తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని ఖమ్మం ఎమ్మెల్యే తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో ఖమ్మం నియోజకవర్గ ప్రజలు ఈ ఎన్నికల్లో తనను అక్కున చేర్చుకున్నారని అన్నారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధితో కూడిన ఆహ్లాదకరమైన ఖమ్మం కోసం అందరితో కలిసి కట్టుగా పని చేస్తానని అన్నారు. రానున్న రోజుల్లో ఖమ్మం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజలందరి సహాయ సహకారాలతో ముందుకెళ్తానని అన్నారు. ఖమ్మం ప్రజల సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నానన్నారు.

# నేను పార్టీ మారడం లేదు

- సోషల్ మీడియా ప్రచారంలో వాస్తవం లేదు
- భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

ఖమ్మం, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): తాను పార్టీ మారడం లేదని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు స్పష్టం చేశారు. తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని తేల్చిచెప్పారు. తాను రేవంత్‌రెడ్డితో ఉన్న పాత ఫొటోను కొంతమంది వ్యక్తులు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని, సోషల్ మీడియాలో వస్తున్నదంతా అబద్ధమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పార్టీలోనే తాను కొనసాగుతానని తేల్చిచెప్పారు. ఖమ్మం నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. తనకు టికెట్ ఇచ్చి తనను గెలిపించిన పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు పాదాభివందనం చేస్తున్నానని అన్నారు. తనపై నమ్మకంతో తనకు ఓటు వేసి గెలిపించుకున్న భద్రాచలం నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని, వారు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అనారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తనను గెలిపించాయని స్పష్టం చేశారు. ఏజెన్సీలో ఉన్న ప్రధానమైన పోడుభూముల పట్టాల సమస్యను కేసీఆరే తీర్చారని గుర్తుచేశారు. రైతులకు రైతుబంధు సహా అనేక పథకాలను అందించిన ఘనత ఆయకే దక్కుతుందని అన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ పట్ల విశ్వాసంగా ఉంటానని, జీవితం ఉన్న వరకు తాను కేసీఆర్‌తోనే నడుస్తానని స్పష్టం చేశారు. గిట్టనివారు ఉద్దేశపూర్వకంగా తనపై చేస్తున్న ఈ దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. గతంలో కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులతో దిగిన ఫొటోను ఇప్పుడు కొంతమంది గిట్టని వారు ఉద్దేశపూర్వకంగానే వైరల్ చేస్తున్నారని అన్నారు. ఇలా తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై ఇప్పటికే ఏసీపీకి సైతం ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.


మాట్లాడుతున్న వెంకట్రావు

## జాతీయస్థాయి పోటీలకు కిన్నెరసాని విద్యార్థి


పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

పాల్వంచ రూరల్, డిసెంబర్ 4: జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు మండలంలోని కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థి హర్షకమల్ ఎంపికయ్యాడు. ఈ నెల 2న మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో జరిగిన రాష్ట్రస్థాయి ఆర్చరీ విభాగ పోటీల్లోతీ విద్యార్థి ప్రథమ స్థానం సాధించి గోల్డ్‌మెడల్ పొందాడు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో జరిగిన పోటీల్లోనూ బహుమతులు సాధించారు. ఈ నెల 17 నుంచి 19 వరకు యూపీలోని నోయిడాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా హర్షకమల్‌ను క్రీడా పాఠశాల హెచ్ఎం చందు, క్రీడల అధికారి డాక్టర్ వీరూనాయక్ సోమవారం అభినందించారు.

## మద్యం మత్తులో ఘర్షణ.. వ్యక్తికి తీవ్రగాయాలు..

పాల్వంచ రూరల్, డిసెంబర్ 4: ఇరువురి మధ్య ఘర్షణ జరిగి వ్యక్తికి తీవ్రగాయలైన సంఘటన మండలంలోని యానంబైలులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. యానంబైలు గ్రామానికి చెందిన కంటెం ప్రవీణ్‌కుమార్ ఆదివారం రాత్రి తన వ్యక్తిగత పనిమీద బయటకు వెళ్తుండగా ఊరి చివరలో అదే గ్రామానికి చెందిన మండే రాంబాబు మద్యం మత్తులో ఉండి అడ్డగించాడు. ఈ క్రమంలో వారి మధ్య పాత విషయాలపై మొదలైన వాగ్వాదం ఘర్షణగా మారింది. దీంతో మద్యం మత్తులో ఉన్న రాంబాబు తన వద్ద ఉన్న మద్యం సీసాను పగులగొట్టి ప్రవీణ్‌కుమార్‌పై దాడి చేశాడు. దీంతో అతడికి నాలుగు చోట్ల తీవ్రగాయాలు కావడంతో అతడు అక్కడే పడిపోయాడు. స్థానికులు గమనించి చికిత్స కోసం పాల్వంచ ఆసుపత్రికి తరలించారు. సోమవారం ప్రవీణ్‌కుమార్ కిన్నెరసాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై కార్తీక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తాం'

చుంచుపల్లి, డిసెంబర్ 4: వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని విద్యానగర్‌కాలనీలో సోమవారం జరిగిన తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ 9వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే అందిస్తున్న సేవలను భవిష్యత్తులోనూ అందిస్తామని అన్నారు. ముఖ్య అతిథులుగా విద్యానగర్ పంచాయతీ సర్పంచ్ బానోత్ గోవిందు, మాజీ ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి, అసోసియేషన్ బాధ్యులు సురేశ్, శివరామకృష్ణ, రామచంద్రరావు, పాండురంగారావు, ధర్మారావు, కేశవరావు, విజయమోహన్, కామేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## ప్రజలకు మరింత మేలు చేయాలి

- కాంగ్రెస్ భిన్నంగా వ్యవహరిస్తే మేం ప్రజల తరఫున నిలబడతాం
- విలేకరుల సమావేశంలో ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ


సమావేశంలో మాట్లాడుతున్న ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

ఇల్లెందు, డిసెంబర్ 4: ఇల్లెందు ఎమ్మెల్యేగా గెలిచిన కోరం కనకయ్య నియోజకవర్గ ప్రజలకు మరింత మేలు చేయాలని మాజీ ఎమ్మెల్యే హరిప్రియా నాయక్ కోరారు. స్థానిక పాత బస్టాండ్ ఏరియాలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గానికి ఎన్నికలకు ముందు మంజూరైన సుమారు 500 కోట్ల నిధులను ప్రజా అవసరాలకు అనుగుణంగా వినియోగించాలని కోరారు. ప్రభుత్వం నుంచి అత్యధిక నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని అన్నారు. ఇక్కడ మంచి నీటి సమస్యను తీర్చానన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వీచిన గాలి వల్ల కాంగ్రెస్ పార్టీ గెలిచిందని అన్నారు. ఇక్కడి నుంచి గెలిచిన కోరం కనకయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్నానని అన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలని, ఈ క్రమంలో ఆ ప్రభుత్వానికి తమ పార్టీ తరపున సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. అందుకు భిన్నంగా వ్యవహరిస్తే ప్రజల తరపున నిలబడతామని స్పష్టం చేశారు. కామేపల్లిలో కొందరు కాంగ్రెస్ నేతలు అల్లర్లకు, ఘర్షణలకు పాల్పడుతున్నారని అన్నారు. ఐదేళ్లలో నియోజకవర్గాన్ని తాము ప్రశాంతంగా ఉంచామని, ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు కూడా అలాగే ఉంచేందుకు కృషిచేయాలని సూచించారు. ఈ ఎన్నికల్లో తన విజయాన్ని కాంక్షిస్తూ శ్రమించిన కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతాయని అన్నారు. అలాగే, కార్యకర్తలకు అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, బీఆర్ఎస్ నాయకులు నాదెండ్ల శ్రీనివాసరెడ్డి, జనగం కోటేశ్వరరావు, జేకే శ్రీను, ప్రమోద్, ఘాజీ, ఆజాం, కృష్ణారావు, గిన్నారపు రాజేశ్, ఎంటెక్ మహేందర్, సన రాజేశ్, సర్పంచ్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## 'ఓపెన్' సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ఖమ్మం ఎడ్యుకేషన్/ కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 4: తెలంగాణ రాష్ట్ర ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో 2023 అక్టోబర్‌లో నిర్వహించిన ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలైనట్లు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం డీఈవోలు సోమశేఖరశర్మ, ఎం.వెంకటేశ్వరచారి, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావులు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఖమ్మం జిల్లాలో పదో తరగతిలో 411 మంది హాజరుకాగా 148 మంది ఉత్తీర్ణత సాధించారని, ఇంటర్మీడియట్‌లో 429 మందికి గాను 199 మంది ఉత్తీర్ణత సాధించారని అన్నారు. కొత్తగూడెం జిల్లాలో పదో తరగతిలో 439 మంది హాజరుకాగా 71 మంది, ఇంటర్మీడియట్‌లో 443 మంది పరీక్ష రాయగా 191 మంది ఉత్తీర్ణులైనట్లు వివరించారు. ఈ పరీక్షా ఫలితాలను www.telanganaopenschool.org వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని చెప్పారు. అలాగే, ఫలితాల్లో అభ్యంతరాలుంటే రీ కౌంటింగ్ కోసం ఇంటర్మీడియట్‌కు రూ.400, పదో తరగతికి రూ.350, రీ వెరిఫికేషన్ కోసం ఇంటర్‌కు రూ.1200, పదో తరగతికి రూ.1200 చెల్లించాలని సూచించారు. ఇందుకోసం ఈ నెల 7 నుంచి 16లోపు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616